

ఉషారాణీభాటియా

# తెల్లవారింది

నిక్కరు జేబులో ఏదో చల్లగా తగిలింది. సుబ్బిగాడు దాన్ని పైకి తీశాడు. సుద్దముక్క వంక తదేకంగా చూశాడు. అలా చూస్తున్నప్పుడు అతని మెడ ఓ పక్కగా వాలింది.

ఇంతలో రివ్వుని దుమ్ము లోపలికి వచ్చింది. అతను చటుక్కున కళ్లు మూసుకున్నాడు. కళ్లకి అడ్డు పెట్టుకోవాలనే ఆతురతలో రెండుచేతులు పైకిఎత్తాడు. సగం విరిగిన సుద్దముక్క చేతిలోంచి కిందపడి దొర్లిపోయింది.

సుబ్బిగాడు చాలా సేపటికి గాని కళ్లు తెరవలేదు. అందుకు కారణముంది. అతను పడుకున్నచోటికి ఎదురుగుండా పెద్దకిటికీ వుంది. ఆ కిటికీకి ఆనుకుని ఓ చిన్న సందు. ఆ సందులో ఎప్పుడూ దుమ్ము రేగుతూనే వుంటుంది కాస్తంత గాలి వీస్తేచాలు, దుమ్ము అంచెలమీద; పైకిలేచి నాలుగు వైపులా వ్యాపిస్తుంది.

అదేం చిత్రమో, రోజూ సుబ్బిగాడు ఉదయం నిద్ర లేవకముందే కిటికీలోంచి దుమ్ము రేగుతుంది. ఆరోజుకూడా, సుబ్బిగాడు కళ్లు చికిరిస్తూ, ఒళ్లు దులుపుకుంటూ లేచినిలబడ్డాడు. ఇంతలో బైట టింగ్‌టింగ్ మన్న సైకీలుబెల్లు వినపడింది. సుబ్బిగాడు కిటికీ దగ్గిరకి పరుగెత్తుకెళ్లి బైటికి లొంగి చూశాడు. 'అమ్మా' అని పిలిచాడు.

ఆచుట్టుపక్కల మరే శబ్దము వినబడలేదు. సుబ్బిగాడు మరో రెండుసార్లు కేకవేశాడు. అతనికి దాహంగావుంది. అది మామూలు దాహం కాదు. సుబ్బిగాడి వయసు పిల్లలకి సామాన్యంగా రోజూ ఉదయంవేసే దాహం. ఓర్పునశించి అతనికి కోపం వచ్చింది. ఆకోపం కాస్సేపటికి దిగులుగా మారింది. ఆ దిగులు మరికొంతసేపటికి జాలిగా మారింది. తను పడుకుని లేచినచోటులోనే మళ్ళీ కూలపడ్డాడు. మోకాళ్లు గడ్డానికి తగిలేటట్టు బాగా ముడుచుకుని పడుకున్నాడు. నాలుగువైపులా పూర్తి వెలుగు రాలేదింకా. కళ్లు మూసుకో

ప్రయత్నించాడుగానీ వాడికి మళ్లీ నిద్ర పట్టలేదు. కళ్లు మండుతున్నాయి. చేతితో నేల రాస్తూ ఆలోచిస్తున్నాడు.

అమ్మ! ఏమయింది? ఈపాటికి ఏం చేస్తూ వుంటుంది. ఆ పచ్చమేడ ఇంట్లో బావినీళ్లు తోడుతూ వుంటుంది. లేదా ఆ తోటయింట్లో అరుగు వూడుస్తుంటుంది. సుబ్బిగాడు ఇంక ఆలోచించలేకపోయాడు.

అతనికి కొద్దిగా చలివేసింది. లేచి కూర్చుని, చొక్కాని బుజాలమీదికి లాక్కున్నాడు. కిటికీ మూద్దామా అనుకుంటూ తలెత్తాడు. కిటికీవైపుకి వెళ్లాడేగానీ, మూయ్యలేదు. సందులోకి చూడటం ప్రారంభించాడు.

బైట అతని కళ్లకేదో కొత్తగా కనిపించింది. చెత్తా చెదారం పేరుకున్న ఇసుక మట్టి లేత బంగారు రంగులో మెరుస్తోంది. దూరాన్నుంచి కొట్టుకువచ్చిన ఎండుటాకులు, కాయితం ముక్కలు అందంగా వూగు

# తెల్లవారింది

తున్నాయి. రాత్రంతా వీధి అరుగుమీద పడుకుని, అప్పుడే నిద్రలులేచిన మనుష్యులు గలగల మాటలు ప్రారంభించారు తెల్లవార్లూ ఇళ్లకి పహారాకాచి, అరిచి, అలసిపోయిన కుక్కలు, తోకలు ఆడిస్తూ, వీధిమధ్యకి వచ్చి, తాపీగా కూర్చుంటున్నాయి. ఎదురుగా టీ దుకాణంలో కప్పులచప్పుడు సన్నగా వినబడుతోంది. పెద్ద పెద్ద అంగలేసుకుంటూ స్త్రీలు అంట్లపనికి పరుగిడుతున్నారు.

చిత్రచీర, పెద్దకొప్పు, కాలికి అందెలు, నల్లని ఆ స్త్రీ కనబడగానే బుచ్చిగాడి ముఖం వికసించింది. కిటికీ వూచలు పట్టుకుని "అమ్మా" అని పిలిచాడు. కానీ ఆ స్త్రీ పిలుపుకి సమాధానం ఇవ్వక ధబీల్న తలుపు తెరిచింది. గుడిసె చూరు తలకి తగలకుండా ఒంగి లోపలికి ప్రవేశించింది. ఆత్రంగా నలువైపులా చూస్తూ సుబ్బిగాడివైపు వచ్చింది. కోపం నటిస్తూ, ఒక్కుమ్మడిన అతని రెక్క పుచ్చుకుని కింద కుదేసింది. "ఎన్నిసార్లు చెప్పానురా సన్యాసీ! ఇలా పెందరాళే లేవద్దని పడుకో. ఇంకా చాలా పొద్దుంది. అన్నది. వాడు తల్లిని కరచుకుని "అమ్మా! దాహమే" అన్నాడు. ఆమెకి అర్థమయింది. "నానాయనే! ఇప్పుడే పట్టుకొస్తాను" అంటూ సత్తుగిన్నె పట్టుకుని, నిముషంలో బైటికి పరుగెత్తింది.

సుబ్బిగాడు మళ్లీ ముడుచుకుని యథాస్థానంలో కూర్చున్నాడు. కళ్లు ఆర్పకుండా తల్లి వెళ్లినవైపే చూస్తున్నాడు. టీకొట్లోకి వెళితే ఉజ్జాయింపున తల్లి ఎంతసేపటికి తిరిగివస్తుందో అతనికి తెలుసు. కానీ ఆవేళ అతని ఊహ తప్పయింది. తల్లి ఎంతకీ తిరిగిరాలేదు. అతను ఆత్రంగా లేచి నిలబడ్డాడు. కిటికీ వూచలకి తల ఆనించి తల్లికోసరం ఆత్రంగా చూస్తున్నాడు. అతనికి చలివేసింది. కానీ అక్కణ్ణుంచి



కదలలేదు.

వెనక్కి తిరిగితే ఏముంది? మళ్లీ ఆ మట్టి నేల. చింకి దుప్పటి. చీకటి. మూల అతనికి ప్రపంచాన్ని చూపించేది ఈ కిటికీయే! ఆతనిలో ఆశలు చిగిర్చేది ఈ కిటికీయే! అతనిలో ఉత్సాహాన్ని రేకెత్తించేది ఈ కిటికీ గోని వెలుతురే! అతనిలో కొత్త భావాల్ని రేపేది ఈ కిటికీలోంచి వీచే గాలియే! అలాటి కిటికీని ఎలా వదలటం?

ఓ రోజు సుబ్బిగాడు ఆ కిటికీ దగ్గర నిలబడి చూస్తుండగానే మీసాల తాతయ్య కనిపించాడు. సన్నగా, పొడుగ్గా, వంగిన నడుం, చేతిలో కర్ర. తాతయ్య తెల్లమీసాలు సుబ్బిగాడికి చిత్రంగా అనిపించాయి. చెంగున బైటకివెళ్లి ఆ తాత కెదురుగావెళ్లి నిలబడ్డాడు. అతన్ని నఖశిఖ పర్యంతం పరిశీలనగా చూడసాగాడు. ఓ చెయ్యి కళ్ల కెదురుగా పెట్టుకుని నడుస్తున్న తాత సుబ్బిగాడి చిన్నారి పాదాలు చూసి ఆగాడు. నవ్వుతూ పలకరించాడు ఆ రోజు నుంచే వాళ్ల నేస్తం ప్రారంభమయింది.

అప్పటినుంచి రోజూ తాత ఆ వైపు వెళ్లేవాడు. సుబ్బిగాడి కిటికీముందు ఆగి, వాడికోసం వెతికేవాడు. వాడితో ఎన్నో ఖబుర్లు చెప్పేవాడు. సుబ్బిగాడి గురించి ఎన్నో ప్రశ్నలడిగేవాడు. ఆ తాతే సుబ్బిగాడితో ఓరోజు అన్నాడు కదా, "చూడు నాయనా! మా రోజులు వేరు. మేము మురికి పేటల్లో పుట్టాము. అక్కడే పెరిగి పెద్దవాళ్ల మయ్యాము. మీరు అలా కాదు. ఇలాటి వాడల్లో పుట్టినా మీకు మంచి భవిష్యత్తు వుంది. మీకు ఉపకారం చేసే ఆసాము లెందరో ఈనాడు వున్నారు. మీకు ఎన్నో సౌకర్యాలు కలుగుతాయి. మీరు మాలాగ బిచ్చమెత్తుకో నక్కరలేదు. దొరబాబులు అవుతారు."

సుబ్బిగాడి చిన్న మనసుకి ఈ మాటలు అర్థం కాలేదు. కానీ ఓ రోజు వాడి అమ్మ అన్నది కదా, "వురేయ్ సుబ్బీ! ఈ మాటు నిన్ను లచ్చి, రాము, పోములతో ఆడటం చూశానా, ఎముకలు విరగగొడతాను. మట్టిలో ఆడావంటే దుమ్ము కొట్టి జబ్బు పడతావురా! వీధిలోకి వెళ్లకు. నా తండ్రి బడికివెళ్లి చదవాలి. దొరబాబు అవాలి."

అందుకనే సుబ్బిగాడు వీధిలోకి వెళ్లడు. ఇరుగు పొరుగు కుర్ర కుంకలతో కలవడు. ఎవరన్నా కలిసి ఖబుర్లు చెప్పమనీ, బ్రతిమాలినా, బెదిరించినా లొంగిపోడు. వాడి చిన్నారి బుర్రనిండా బోలెడన్ని ఆలోచనలున్నాయి. వాడి లేత మనసు నిండా కోకొల్లల ఆశలున్నాయి. వాడి కళ్లు ఎప్పుడూ ఏదో వెలుగు కోసం వెతుకు తుంటాయి.

ఆ కిటికీలోంచి బైటికి చూస్తుండే సుబ్బిగాడికి రకరకాల ఊహలు కలిగేవి. నేను చూస్తున్న ప్రపంచం ఎప్పుడూ ఇలాగే వుండలా ఏం? ఈ చెట్లు, యిళ్లు, వీధులు మనుషులు మారకూడదా? పచ్చమేడ లాటి ఇళ్లు ఇక్కడ రావచ్చు. తనకి ఒంటినిండా చొక్కా. కాళ్లకి చెప్పులు. సత్తుగిన్నె బదులు అమ్మ చేతిలో మంచి సంచీ. సుబ్బిగాడి ఒళ్లు పులకరించేది. అవునురోజూపొద్దు పొడుస్తుంది. కానీ రోజూ జీవితం ఒకలాగ వుండనక్కరలేదు. తెల్ల మీసాల తాత అస్తమానం అంటుంటాడు కదా! మార్పు వస్తుందని, మొన్న గాంధీటోపీ పెట్టుకుని ఈ సందులోకి వచ్చిన లావుపాటి ఆయన చెప్పలేదూ, మార్పు రాక తప్పదని. వచ్చితీరుతుంది. ఈ బస్తీ పెద్ద భవనాలతో, తోటలతో నిండిపోవచ్చు, లేదా తనే ఈ స్థలం వదిలి మరో మంచి చోటుకి తరలిపోవచ్చు. తన బ్రతుకంతా ఈ మట్టిలోనే కొట్టుకు పోవాలనేమిటి? అలా ఆలోచిస్తూనే సుబ్బిగాడు ఓ రోజున చిన్న సుద్దముక్క సంపాయించాడు తన కేదో పెద్ద చదువు లొచ్చేసినట్టు భావిస్తూ నేల మీద పిచ్చిగీతలు గీసేవాడు. వాటిని చూసుకుని తనలో తనే మురిసిపోయేవాడు.


* * *

ఆ రోజున సుబ్బిగాడి తల్లి ఓ పట్టాన టీ కొట్టులోంచి బైటికి రాలేదు. వాడిదాహం చల్లారిపోయింది. శోషవచ్చినట్లు కళ్లు తిరుగుతున్నాయి. గోడకి జారగిలబడి కునుకు తీస్తున్నాడు. ఇంతలో తల్లి వచ్చి, జబ్బ పట్టుకుని, గబగబ వూపింది, "వురేయ్, సుబ్బీ! ఇంద తాగు, నేను తొందరగా వెళ్లి పోవాలి. ఇవాళ మన బస్తీకి పెద్దబాబులంతా వస్తారు. నాకు పనుంది" అంటూ పరుగెత్తింది.

సుబ్బిగాడు ఆవురావుర్న టీ నీళ్లు తాగాడు. కాస్త సత్తువ వచ్చినట్లయి లేచినిలబడ్డాడు. తల్లిని వెతుక్కుంటూ బైటికి పరుగెత్తాడు.

అప్పటికే వీధిలో చాలామందిజనం మూగివున్నారు. గట్టిగా అరుస్తూ మాట్లాడుకుంటున్నారు. వాళ్లమధ్య తెల్ల మీసాల తాతయ్య వున్నాడు. గాంధీ టోపీ లావుపాటి ఆయన కూడా నిలుచున్నాడు. సుబ్బిగాడికి అక్కడ తల్లి కనపడలేదు. ఇంతలో పెద్దగా శబ్దం చేసుకుంటూ రెండు జీపులు సందులోకి వచ్చి ఆగాయి. అందులోంచి ఎర్రటోపీలు పెట్టుకున్న వ్యక్తులు కొందరు హడావుడిగా దిగారు.

కొందరుగట్టిగా ఏడుస్తున్నారు. కొందరు పోట్లాడుతున్నారు. సుబ్బిగాడికి భయమేసింది "అమ్మా" అని పిలుస్తూ నాలుగు వైపులా వెతకసాగాడు. అంతే, ఆ తరువాత వాడికేం జ్ఞాపకం లేదు.



# తెల్లవారింది

సుబ్బిగాడు కళ్ళు తెరిచేసరికి అమ్మ ఒళ్ళో వున్నాడు. పైన పచ్చని కొబ్బరిచెట్ళు నీడ విస్తూంది. పక్కన రెండు సత్తుగిన్నెలు. చిన్నబట్టలమూట. అమ్మ ఒక్కర్తే కాదు. అక్కడ చాలామంది వున్నారు. చెట్లనీడల్లో కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. సుబ్బిగాడికి ఏదో భయమేసింది. "అమ్మా" అంటూ తల్లిని కరుచుకున్నాడు. ఆరోజు వాడితల్లి పనికిపోలేదు. మధ్యాహ్నమయింది. పొద్దువాలింది. నీరసంగా తల్లిని కరుచుకుని పడుకున్న సుబ్బిగాడికి తన జీవితంలో పెద్ద మార్పుఏదో రానేవచ్చిందన్న భావం కలిగింది.

* * *

తెల్లవారింది. సుబ్బిగాడు కళ్ళుతెరిచి కిటికీకోసరం వెతికాడు. కాని చుట్టూతా వెలుతురు — అంతా వెలుతురె. వాడి కళ్ళకి ఆ వెలుగు మిరమిట్లు గొలిపింది. పక్కనే పడుకున్న తల్లిని "అమ్మా! దాహం" అంటూ లేపాడు.

ఆమె లేచింది ... నీరసంగా తూలుతూ, సుబ్బిగాణ్ణి వెంటేసుకుని వీధిలోకి వచ్చింది. కొత్తసందులు, పరిసరాలు, వాడు ఆసక్తిగా చూస్తూ, లేనిశక్తి తెచ్చుకుని, గబగబ అడుగు లేస్తున్నాడు. ఇంతలో ఓ దృశ్యం చూసి చటుక్కున ఆగిపోయాడు. ఆ స్థలం అతనికి చిరపరిచితంగా కనిపించింది. కానీ ఒక్కటే తేడా. ఇప్పుడక్కడ ఆ గుడిసెలు లేవు. మురుగు కాలవ లేదు. ఖాళీ స్థలం. విశాలంగా వుంది. అతి విశాలంగా పరచుకుని వుంది.


సుబ్బిగాడి మనసు ఓ క్షణం ఆనంద పడింది కళ్ళు తళ తళ మెరిశాయి. "అమ్మా, తాత చెప్పిన మాట నిజమేనా? ఇక్కడ పెద్ద బంగళాలు వస్తాయా?" అనడిగాడు. తల్లి అతనివంక అయోమయంగా చూసింది. వెంటనే ఒంగి పిచ్చి సుబ్బిగాడి, పదేళ్ల ఆ చిన్నవాడి బుజం తట్టింది. "అప్పన్నా! ముందుకి పద" అంది.

తాత చెప్పిన మార్పు ఇదేనేమో! ఆ రోజు తెల్లటోపీ ఆయన వర్ణించిన మార్పు ఇదే లాగుంది. అక్కడ లేచే బంగళాలలో తనూ అమ్మా వుంటారా? ఎందుకుండకూడదు? సుబ్బిగాడి మనసు ఆనందంతో ఊగిసలాడింది. ఉత్సాహంతో గబ గబ ముందుకి అడుగు లేశాడు.

వాడి వెనకాలే ఉవ్వెత్తున దుమ్ము లేచింది. ఆ దుమ్ములో వాడి పాదాల గుర్తులు ఇట్టే చెదిరిపోయాయి.

సుబ్బిగాడి లాటివాళ్ళు యింకా ఎందరో వున్నారు. వాళ్ళంతా ఆ వీధిలో అడుగు లేస్తూ వెళుతూనే వున్నారు. ఉవ్వెత్తున లేచిన దుమ్ములో వాళ్ల పాదాల గుర్తులు చెదిరిపోతూనే వున్నాయి.

తూరుపున తెల్లవారుతూనే వుంది.




[గత సంచిక తరువాయి]

ఇంతలో అన్నపూర్ణమ్మ దేవయ్యయింటికి అమాంతంగా ఊడిపడింది.

"ఏమిరా అన్నయ్యా! మా అబ్బాయికి సంబంధాలు చాలా వస్తున్నై. ఎవరు వచ్చినా మేనరికం ఉందని చెబుతున్నాను. నువ్వేమో బెల్లంకొట్టిన రాయల్లే కూర్చున్నావు. పిల్లనిస్తానని అనవైతివి. ఒక కడుపున పుట్టిన వాళ్ళం కదా — మనమే అడిగితే కొమ్ములూ గొలుసులూ పోతాయా అని నా అంతట నేనే బయలుదేరి వచ్చాను.తేల్చుకోవడానికే వచ్చాను.

ఆడపిల్లల వాళ్ళకి ఒక సౌకర్యం ఉంటుంది. కావాలన్న మగపిల్లవాణ్ణి వెతుక్కోవచ్చు. మగపిల్లలవాళ్ళు పిలిచిన చోటికే వెళ్లి, ఆ పిల్ల నచ్చిందో నచ్చలేదో చెప్పవలసిన వాళ్ళేకాని, మీ అమ్మాయిని మా అబ్బాయికిస్తారా అని అడిగే అవకాశం లేదు. నువ్వూ నేనూ ఒక తానులో ముక్కలమే కనుక, బింకాలు పోకుండా, నేనే మీ అమ్మాయిని మా అబ్బాయికిమ్మని అడగడానికి వచ్చాను. వింటున్నావా వదినా!" అని భామమ్మనుకూడా హెచ్చరించింది.

"వింటూనే ఉన్నా. ఆయన అన్నయ్య. నువ్వు చెల్లెలివి. మధ్య నేనెవ్వరిని. నాదేమున్నది! పరాయిదాన్ని" అన్నది భామమ్మ.

"పప్పులేని పులగం ఉంటుందా వదినా! భార్యాభర్తలు ఎప్పుడయినా ఒకటే. మిగిలిన వాళ్ళే పరాయివాళ్ళు. రేపు కన్యాదానానికి పీట మీద కూర్చునే దానవు నువ్వు. నాకిష్టం లేదు నేను కూర్చోనంటే మా అన్నయ్య ఏం చేస్తాడు? నా కోసం, మీ యిద్దరిమధ్యా తేడా రాకూడదు. మీ క్షేమం కూడా నేను కోరవలసినదానను. మీ యిద్దరికీ యిష్టమయితేనే యీ సంబంధం కుదురుతుంది. నీ కిష్టంలేకపోతే, దీనివల్ల మీ యిద్దరి మధ్యా పొరపులు వస్తే నేను చేసుకోనే చేసుకోను."

"నా కిష్టంలేదు" అన్నది భామమ్మ నిష్కర్షగా.

"విన్నావా అన్నయ్యా!" అన్నది అన్నపూర్ణమ్మ.

"విన్నానమ్మా! విన్నాను. ఖంగుమని మాట్లాడింది మీ వదిన. నాకు చెవుడు లేదుకదా అమ్మా."

"కారణం కనుక్కో."

"కారణం కనుక్కునే వాడినయితే నేను